## షూటింగ్‌లో పిల్లలకు అత్యుత్తమ శిక్షణ ఇవ్వాలి



షూటింగ్ అకాడమీని ప్రారంభించి రైఫిల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్/ కొత్తపల్లి, ఏప్రిల్ 30 : నగరంలోని భగత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన స్వదేశీ రైఫిల్ షూటింగ్ అకాడమీని బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలోని రైఫిల్ షూటింగ్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. షూటింగ్‌లో పిల్లలకు అత్యుత్తమ శిక్షణలు అందించి దేశానికి పతకాలు తెచ్చేలా తీర్చిదిద్దాలని నిర్వాహకులను సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా ఒలింపిక సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు, దిండిగాల మహేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

ఇల్లందకుంట (హుజూరాబాద్ టౌన్), ఏప్రిల్ 30: ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామంలో బుధవారం వీధి కుక్క దాడి చేయగా బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన రాజు, వనిత దంపతుల కుమారుడు అయాన్(2) ఆరుబయట ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వీధి కుక్క దాడి చేసింది. అప్రమత్తమైన తల్లిదండ్రులు తీవ్రగాయాలపాలైన బాలుడిని చికిత్స కోసం హుజూరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తీసుకువెళ్లారు. గ్రామ పరిధిలో ఇటీవల ఇద్దరు పిల్లలపై వీధి కుక్కలు దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కల నుంచి కాపాడాలని కోరుతున్నారు.


**PUBLIC NOTICE**


It is here by informed that my client **Sri Sresth Surana S/o Surana Pradeep, R/o 5-30/1/60, Villa No.60, Domus Villas, Thumukunta Village, VTC, Thumukunta, R.R.Dist** is the owner of House bearing no. 7-2-551/a (PTIN No. 1102045114) together with land admeasuring 302.60 Sq.Yds in Sy.No.No. 1068 situated at Mankammathota, locality of Karimnagar Town and Dist having purchased the same vide Registered Sale Deed bearing document No. 10114 of 2024 dated 29.10.2024 from Mohammed Ari Imtiyaz S/o Mohammed Asad Ali.

It is further informed that my client has lost his original Link documents bearing Regd. Agreement of sale cum General Power of Attorney No. 11876 of 2004 dated 19.11.2004, Registered Sale Deed bearing document No. 5642 of 2010 dated 07.07.2020 & Registered Sale Deed bearing document No. 4582 of 1999 dated 28.09.1999 pertaining to above mentioned property. Now my client is calling objections, claims, right, lien, or titleif any over the said property through this public notice.

Further it is informed that, any person finding the above mentioned documents may return the same by way of registered post to the address given below or inform the undersigned by telephone. If any person/(s) having any objections,claims, right, lien, title over the said property may please contact the under signed within **7 days** from the date of publication of this notice with relevant documents in support of their claim, As otherwise my client will proceed, treating no claims whatsoever in nature over the said property.

**Sd/- K.RAM RATAN REDDY, Advocate**
#A 4/B, Ground Floor, Vikrampuri Colony,
Secundrabad-500 009, Telangana,
**Cell: 9390399911 & 9393099911,**
Email: K3r.advocate@gmail.com







## ఘనంగా బసవేశ్వరుడి జయంతి



బసవేశ్వరుడి చిత్రపటం పక్కన కలెక్టర్, ఇతర అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు

కలెక్టరేట్, ఏప్రిల్ 30 : మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతి వేడుకలు బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఘనంగా జరిపారు. కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిథిగా పాల్గొని బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, మూఢనమ్మకాలు బలంగా ఉన్న పూర్వపు రోజుల్లో తన బోధనలతో ప్రజలను మూఢాచారాల నుంచి కాపాడారని తెలిపారు. సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. సమానత్వాన్ని బోధించిన అభ్యుదయవాది బసవేశ్వరుడి జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, లింగాయతుల సంఘం నాయకులు వీరశైవ మహాసభ ప్రతినిధులు, పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేశారు. బసవేశ్వరుడు సమాజానికి అందించిన సేవలను కొనియాడారు.

## 'కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రశ్నించడం నేరమైంది'

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 30: ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికీ ప్రశ్నించే హక్కు ఉందని, అయితే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో ప్రశ్నించడం నేరం అయిందని హుజూరాబాద్ బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మ్యాకల సాగర్ రెడ్డి, పోతరవేణి అనిల్ కుమార్, ఎడ్ల రాకేశ్, షేక్ అర్షద్ హుజూరాబాద్ కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన యువ నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు బనాయించడం ఎంత దుర్మార్గమో ప్రజలు గుర్తించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తినందుకు ప్రజాపాలనలో కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందని తెలిపారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని, ఇది ప్రతీకారం తీర్చుకునే ప్రభుత్వమని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు.

## అధ్యాపకుల తాత్కాలిక సమ్మె విరమణ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30 : శాతవాహన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న నిరవధిక సమ్మెకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు శాతవాహన కాంట్రాక్ట్ అండ్ పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ జేఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జోసెఫ్ రాజ్ పేర్కొన్నారు. తమ డిమాండ్లపై ఆలోచన చేసి మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో, స్టేట్ అసోసియేషన్ బాడీ నిర్ణయం మేరకు నిరవధిక సమ్మెను తాత్కాలికంగా ముగించినట్లు చెప్పారు.

## అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగ విరమణ

తెలంగాణచౌక్, ఏప్రిల్ 30: ఆర్టీసీ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందగా, ఆర్ఎం రాజు సన్మానించి, సంస్థ తరపున బహుమతి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, డీఎంలు శ్రీనివాస్, విజయమాధురి పాల్గొన్నారు. కాగా, నూతన అకౌంట్స్ ఆఫీసర్‌గా జియావొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు.

## ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

కలెక్టరేట్, ఏప్రిల్ 30 : జిల్లాలో 2024–25 యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ఈసీజన్‌లో మంగళవారం నాటికి 79,570 మెట్రిక్ టన్నుల ధాన్యం 11,226మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇందులో సన్నరకాలు 6,871మెట్రిక్ టన్నులు ఉండగా, 72,698 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ. 76.13కోట్ల మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 16 ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు కొనుగోలు చేసి కేంద్రాలకు అందజేయడంతో తేమ, తాలు లేకుండా రైతులు నాణ్యమైన ధాన్యం విక్రయానికి తెస్తున్నారని కలెక్టర్ వివరించారు. అలాగే, 8 ప్యాడీ డయ్యర్ యంత్రాలకు త్వరలోనే టెండర్లు పిలిచి, వారం రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

## టెన్త్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

మానకొండూర్/కొత్తపల్లి/వీణవంక/ కరీంనగర్ రూరల్/ సైదాపూర్/ శంకరపట్నం/ హుజూరాబాద్ టౌన్/ రామడుగు/ తిమ్మాపూర్/ చిగురుమామిడి, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని విద్యార్థులు సత్తాచాటారు. మండలాల వారీగా ఉత్తీర్ణత శాతాన్ని ఆయా మండలాల విద్యాధికారులు వెల్లడించారు. మానకొండూర్‌లో 95 శాతం, కొత్తపల్లి మండలంలో 97.8 శాతం, వీణవంకలో 98 శాతం, కరీంనగర్‌లో 99 శాతం, సైదాపూర్‌లో 99.3 శాతం, శంకరపట్నంలో 98, హుజూరాబాద్‌లో 97.78, రామడుగులో 99.2 శాతం, చిగురుమామిడిలో 99.60 శాతం, గన్నేరువరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని సీవోఈ పాఠశాలలో 150మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ పాసయ్యారు. ఇందులో 134మంది 500కుపైగా మార్కులు సాధించారు. అలాగే మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలల్లో జిల్లా వ్యాప్తంగా 645మంది విద్యార్థులకు గానూ ఒక విద్యార్థి ఫెయిల్ అయ్యాడు. పలు పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఆర్సీవో అంజలి, కన్వీనర్ సరిత అభినందించారు.

## జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీ

కలెక్టరేట్, ఏప్రిల్ 30 : జిల్లా రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల బదిలీల కోసం కొన్నిరోజులుగా కొనసాగుతున్న కసరత్తు ఎట్టకేలకు ముగిసింది. పలువురు తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ, కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం అర్ధరాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్లలో డివిజన్‌కు రెండు మండలాలు మినహా మిగతా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్లను బదిలీ చేశారు. వీరంతా వెంటనే విధుల్లో చేరాలంటూ ఆదేశాలు వెలువరించగా, తమకు పోస్టింగ్ కేటాయించిన కార్యాలయంలో చేరేందుకు బదిలీ అయిన తహసీల్దార్లు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం కొత్తపల్లిలో కొనసాగుతున్న రాజేశ్ కరీంనగర్ రూరల్‌కు, విజయ్‌కుమార్ తిమ్మాపూర్ నుంచి మానకొండూర్‌కు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి రామడుగు, అక్కడ కొనసాగుతున్న వెంకటలక్ష్మి కొత్తపల్లికి బదిలీ అయ్యారు. అలాగే, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీహెచ్.రాజు జమ్మికుంటకు, అక్కడ కొనసాగుతున్న జి.రమేశ్‌బాబు శంకరపట్నం, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బి.భాస్కర్ హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా, ఇప్పటివరకు ఇక్కడ కొనసాగిన కె.శ్రీనివాస్‌రెడ్డి తిమ్మాపూర్‌కు, కరీంనగర్ అర్బన్ కార్యాలయ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జె.నరేందర్ గన్నేరువరం, అక్కడ విధుల్లో ఉన్న ఈ.నరేందర్ కరీంనగర్ అర్బన్‌కు, సైదాపూర్ తహసీల్దార్ జి.మంజుల వీణవంకకు, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఎం.కాళీచరణ్ జి సెక్షన్‌కు, అక్కడ కొనసాగుతున్న ఎస్.శివానీ సిసెక్షన్‌కు బదిలీ అయ్యారు. ఇల్లందకుంట, హుజూరాబాద్, చిగురుమామిడి, గంగాధర తహసీల్దార్లకు మాత్రం స్థానచలనం కలుగలేదు.

## వడదెబ్బతో వృద్ధుడి మృతి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 30: హుజూరబాద్ మున్సిపల్ పరిధిలోని ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బోరగాల ఎల్లయ్య(78) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎల్లయ్య పశువులకు మేత వేసేందుకు వెళ్లగా వడదెబ్బ తగిలింది. సొమ్మసిల్లి పడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం దవాఖానకు తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతి చెందాడు.

## ఎల్ఐసీ యూనియన్ మజ్జిగ పంపిణీ

విద్యానగర్, ఏప్రిల్ 30 : తమ కార్మిక ఉద్యమాల నాయకుడు కే వేణుగోపాల్ నాలుగో వర్ధంతి సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగులు తమ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మార్కెటింగ్ మేనేజర్ కే సోమశేఖర్ రావు మాట్లాడుతూ వేణుగోపాల్ రావు కేవలం ఉద్యమాలకు నాయకుడు మాత్రమే కాదని, అసలైన మానవతావాదని కొనియాడారు. యూనియన్ కార్యదర్శి వామన్ రావు మాట్లాడుతూ వేణుగోపాల్ రావు అన్ని రంగాల మీద అవగాహన ఉన్న గొప్ప దార్శనీకుడని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 30: ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికులు ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమన్ సూచించారు. నగరంలోని ఆర్టీసీ జోనల్ దవాఖానలో వడ దెబ్బ కారణంగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన బుధవారం పరామర్శించారు. హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహారావు రూపొందించిన వేసవి జాగ్రత్తలు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ డాక్టర్ వసుధ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థి మృతికి సంతాపం

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని శ్రీరామ హాస్టల్‌లో ఉంటూ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో హనుమాండ్ల వికాస్ రెడ్డి అనే విద్యార్థి మృతి చెందగా, జ్యోతిష్మతి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు కళాశాల ఆవరణలో సంతాపం తెలిపారు. అతడు జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. కాగా, వికాస్ రెడ్డి చెల్లించిన చివరి సంవత్సరం మొత్తం ఫీజును అతడి తల్లిదండ్రులకు తిరిగి వాపసు ఇవ్వాలని కళాశాల యాజమాన్యం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న పర్సు అందజేత

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఏప్రిల్ 30: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఇన్ గేట్ వద్ద బుధవారం రాత్రి తీగలగుట్టపల్లికి చెందిన సాలగ్రామ శైలజ (42), తన భర్త నాగార్జునతో వస్తూ పర్సును పోగొట్టుకున్నారు. పర్సులో నగదు రూ.1883, సుమారు మూడు తులాలు బంగారు నల్లపూసల తాడు (విలువ సుమారు రూ.3 లక్షలు) ఉన్నాయి. ఈ పర్సును అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ వి అశ్విని గుర్తించి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ సమక్షంలో, పర్సును శైలజకు అందులోని వస్తువులు సహా అప్పగించారు. శైలజతో పాటు ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ట్రాఫిక్ సీఐ.. మహిళా కానిస్టేబుల్ అశ్వినిని అభినందించారు.

## విద్యా సంస్థల ర్యాంక్‌లపై విచారణ జరిపించాలి

తెలంగాణచౌక్,ఏప్రిల్ 30: జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో విద్యాసంస్థలు ప్రకటించిన ర్యాంక్‌లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ కేటగిరీల్లో వచ్చిన ర్యాంక్‌లను జనరల్ కేటగిరీగా ప్రచారం చేసుకుంటు విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా తుమ్మనపల్లి యువతి ఎంపిక



బత్తుల మానస

హుజూరాబాద్, ఏప్రిల్ 30: హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామానికి చెందిన బత్తుల మానస జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. బత్తుల నర్మద, మల్లేశం దంపతుల కుమార్తె అయిన మానస, ఇటీవల జరిగిన రాత పరీక్షకు హాజరయ్యారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 43 మంది అభ్యర్థులు జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక కాగా, మానస 13వ ర్యాంకు సాధించారు. పేదరికంతో పోరాడుతూ కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై ఉన్నత లక్ష్యాన్ని సాధించిన మానసను గ్రామస్తులు, విద్యావంతులు, ప్రముఖులు అభినందిస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 30: నగరంలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏ డీఈ లు శ్రీనివాస్ గౌడ్, లావణ్య ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఉదయం 7నుంచి 10గంటల వరకు సవరాన్ స్ట్రీట్, శ్రీలత హాస్పిటల్ ఏరియా, మెడికవర్ వెనుక ప్రాంతం, బ్యాంక్ కాలనీ రోడ్ నంబర్ 1, 2, 3, అల్ఫోర్స్ స్కూల్, బూత్ బంగ్లా, రెడ్డి ఫంక్షన్ హాల్, ఎస్ఆర్ కాలేజీ ప్రాంతాలు, ఉదయం 8నుంచి 10గంటల వరకు ప్రగతి నగర్, మార్కండేయ నగర్, సాయిబాబా టెంపుల్, లారెల్ స్కూల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## భవన నిర్మాణ రంగంలోనూ డ్రోన్‌ల వినియోగం

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 30: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నదని, ఈ క్రమంలో భవన నిర్మాణంలోనూ డ్రోన్ల వినియోగం పెరుగుతున్నదని వరంగల్ కిట్స్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజిత్ రెడ్డి తెలిపారు. బుధవారం సింగాపూర్ కిట్స్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ఒక రోజు సెమినార్‌కు ముఖ్య వక్తగా హాజరై, డ్రోన్ టెక్నాలజీస్ ఫర్ ద కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ అంశంపై ఉపన్యసించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, సమన్వయకర్త అధ్యాపకుడు డి .మనోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్లూబెల్స్ విద్యార్థుల విజయదుందుభి



బ్లూబెల్స్ విద్యార్థులను అభినందిస్తున్న జంగ సునీతా మనోహర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30 : జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో వరుసగా పదో సంవత్సరం కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ జంగ సునీతా మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో పాఠశాలకు చెందిన కె స్మరణి 575 మార్కులు సాధించి విజయదుందుభి మోగించారన్నారు. అలాగే, జి శ్రావ్య 574, పి నిశ్విక 572, డి శ్రీనిధి 567, కె శ్రీనిధి 555, వి బిందు లహరి 552, కె హర్షవర్ధన్ 551, ఎం భవిత్ 546, కె హరిణి 546, కె అక్షిత 544 మార్కులు సాధించారని చెప్పారు. పాఠశాలకు చెందిన 37 మంది విద్యార్థులకు గానూ 26 మంది 500కుపైగా మార్కులు సాధించారన్నారు. ఇక్కడ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

## వసంత్ వ్యాలీ ఉత్తమ ఫలితాలు



వసంత్ వ్యాలీ విద్యార్థినిని అభినందిస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో హనుమాన్ నగర్‌కు చెందిన వసంత్ వ్యాలీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. వంగల అక్షయ 576 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, వెల్మరెడ్డి అక్షత్ రెడ్డి, బండ అంకిత 567 మార్కులు సాధించి సత్తా చాటారు. 19 మంది విద్యార్థులు 550కిపైగా మార్కులు, 70 మంది విద్యార్థులు 500కుపై మార్కులు సాధించి విజయదుందుభి మోగించారని డైరెక్టర్ స్వరూప బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## జాన్సన్ గ్లోబల్, కోరా విద్యార్థుల ప్రభంజనం



జాన్సన్ గ్లోబల్, కోరా విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఎస్వీజేసీ విద్యాసంస్థలకు చెందిన జాన్సన్ గ్లోబల్ హైస్కూల్, కోరా పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల ప్రిన్సిపాల్, డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ మాట్లాడుతూ, పటిష్టమైన విద్యా ప్రణాళికకు ప్రతి విద్యార్థి సక్సెస్ ప్రధాన ఉద్దేశంగా తమ కరిక్యులం డిజైన్ చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో తమ విద్యాసంస్థలు రాష్ట్రస్థాయిలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విజయదుందుభి మోగించినట్లు తెలిపారు. ఇందులో కే వినూత్న 580, ఏ తరుణిక, పూజిత, ఎన్ శ్లోకా రెడ్డి 572, బి శ్రీవర్ష 570, శ్రీకర్ 569, టి శౌర్య తేజ 566, ఏ సహస్ర 564, పి అక్షయ్ 561, ఏ మనుజ్ఞ 557, లిఖిత గుప్తా 552, పరంకుశం శ్రీహర్ష 549 మార్కులు సాధించడం సంతోషంగా ఉన్నదన్నారు. పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వాహకులు వూట్కూరి మహిపాల్ రెడ్డి, మేడ వెంకట వరప్రసాద్, కాంతలా రాంరెడ్డి, వంగళ సంతోష్ రెడ్డి ఉన్నారు.

## లారెల్ విద్యార్థుల విజయకేతనం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో సప్తగిరికాలనీలోని లారెల్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి విజయకేతనం ఎగరవేశారని పాఠశాల కరస్పాండెంట్ బి వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ బి మంజుల రావు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మాట్లాడుతూ, పాఠశాలకు చెందిన విద్యార్థి అత్యధికంగా 574 మార్కులు సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో చదివిన 50 శాతం విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ఈ అద్భుత ఫలితాల సాధనలో తోడ్పడిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## కాకతీయ ఒలింపియాడ్ విద్యార్థుల ప్రతిభ



కాకతీయ ఒలింపియాడ్ విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30 : జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాకతీయ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ వొంటెల కామేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ప్రహస్త 574 మార్కులు సాధించగా, సింధూజ 571, అనన్య 565 మార్కులు సాధించడమే కాకుండా మొత్తం 31 మంది విద్యార్థులకు 21 మంది 500 మార్కులు సాధించడంతో పాటు, 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. డైరెక్టర్ అజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అంజయ్య, విద్యార్థులను అభినందించారు.

## విశ్వశాంతి విజయభేరి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30 : జిల్లా కేంద్రంలోని రాంనగర్, సప్తగిరి కాలనీలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయభేరి మోగించారని ప్రిన్సిపాల్ రమేశ్, డైరెక్టర్లు ఆంజనేయులు, రాజేశ్, గిరిధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు: ఎస్ఈ

ముకరంపుర, ఏప్రిల్ 30: వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా లోడ్ పెరిగే అవకాశం ఉన్న రాచర్ల తిమ్మాపూర్, మోహినికుంట, జేపీ నగర్, బోనాల, మల్లారం, రేణికుంటలో 5ఎంవీఏ, కరీంనగర్ టౌన్ బ్యాంక్ కాలనీలో 12.5ఎంవీఏ కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ టౌన్‌లో ఉజ్వల పార్క్, వాటర్ వర్క్స్, ఎస్సారార్, ఖాజీపూర్, వీర్నపల్లి, నవాబ్ పేట్‌లో పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏకు పెంచామని తెలిపారు. సప్తగిరి కాలనీ, సాయి నగర్( ఖాజీపూర్ –2) లో 8ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు, కొర్కల్, వట్టెములలో 3.15ఎంవీఏ నుంచి 5ఎంవీఏ పెంచినట్లు తెలిపారు. కరీంనగర్ టౌన్, ఖాజీపూర్ (బావుపేట), చిగురుమామిడి, సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రాంతాల్లో పీటీఆర్‌లను కొత్తగా ఏర్పాటు చేయడం, సామర్థ్యం పెంచడంతో సరఫరాలో ఇబ్బందులను అధిగమించినట్లు తెలిపారు. ఇప్పటివరకు కొత్తగా 292 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయగా 319 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 6 వీసీబీ (వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్)లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా కరీంనగర్‌లో ఎనిమిది సబ్ స్టేషన్ల పరిధిలో 21 కిలోమీటర్లు, సిరిసిల్ల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటర్ లింకింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. వోల్టేజ్ హెచ్చుతగ్గుల నియంత్రణకు 600కే వీఏఆర్ సామర్థ్యం ఉన్న 23కెపాసిటర్ బ్యాంకులతో పాటు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లలోనూ కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## రిబేట్ వసూళ్లు రూ. 15.32 కోట్లు

కార్పొరేషన్, ఏప్రిల్ 30: కరీంనగర్ నగరపాలక సంస్థలో ముందస్తు ఆస్తి పన్నులు భారీగానే వసూలయ్యాయి. ప్రభుత్వం ఏప్రిల్ 30లోగా చెల్లించిన వారికి 5 శాతం రిబేట్ ప్రకటించడంతో పన్నుల చెల్లింపునకు ఎక్కువ మంది ప్రజలు ముందుకు వచ్చారు. బుధవారం వరకు నగరపాలక సంస్థకు రూ. 15.32కోట్ల పన్నులు వసూలయ్యాయి. కాగా చివరి రోజున ఏకంగా రూ.1.52 కోట్ల మేరకు పన్నులు వసూళ్లు కావడం గమనార్హం. నగరపాలక సంస్థకు రూ.40 కోట్ల మేరకు పన్నులు రావాల్సి ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే రూ. 15 కోట్లకు మించి వసూలయ్యాయి.